క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

పెళ్లకూరు: మండలంలోని పునబాక దళిత కాలనీకి చెందిన పైపూరి మునెమ్మకు మంజూరైన వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలను ఎంపీపీ శేఖర్‌రెడ్డి అందజేశారు. మునెమ్మ భర్త శంకరయ్య(55) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి బీమా అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, లింగమనాయుడు, కృష్ణయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్నభోజన పథకం అమలు తీరును ఎంఈఓ కృష్ణయ్య తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రెండు రోజులుగా ఇక్కడ విద్యార్థులకు నిర్వాహకులు భోజనం పెట్టడంలేదనే విషయం విద్యాశాఖాధికారుల దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఎంఈఓ విద్యార్థులకు భోజనం అందేలా చర్యలు చేపట్టారు. అనంతరం నెమలిమిట్టఅగ్రహారం లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పలు రికార్డులు తనిఖీ చేశారు.

సైదాపురంలో రీసర్వే ప్రారంభం



రీసర్వేకి సిద్ధమవుతున్న సిబ్బంది

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో డ్రోన్లు ద్వారా రీసర్వే ప్రారంభించామని మండల సర్వేయర్ హజరత్తయ్య తెలిపారు. సైదాపురం పంచాయతీలో భూములను గురువారం డ్రోన్ సహాయంతో రీసర్వే చేపట్టారు. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియను కొనసాగుతుందని ఆయన చెప్పారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న మునిచంద్ర

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, కొత్తూరు, చెంబేడు, పునబాక, అక్కగారిపేట తదితర గ్రామాల్లో గురువారం అయోధ్య రాముని అక్షింతలు బీజేపీ నేత బీ మునిచంద్ర ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. అక్షింతలు అందుకున్న దంపతులు, భక్తులు ఈ నెల 22న అయోధ్య రామమందిర ప్రారంభం సమయంలో వినియోగించుకోవాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పెళ్లకూరు: ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం సూళ్లూరుపేట నియోజకవర్గశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన క్యాలెండర్‌ను గురువారం పెళ్లకూరులో ఆర్డీఓ చంద్రముని చేతుల మీదుగా ఆవిష్కరించారు. డివిజన్ పరిపాలనాధికారి గీతావాణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్, డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్, నాయుడుపేట తాలూకా అధ్యక్షుడు సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు నవీన్, సభ్యులు అనిత, భాగ్యమ్మ పాల్గొన్నారు.

బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



సామగ్రి అందజేస్తున్న రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు

చిల్లకూరు: రెడ్‌క్రాస్ తిరుపతి జిల్లా శాఖ ప్రతినిధులు చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో తుపాను బాధితులకు వంట సామగ్రి, ఇంటిపై కప్పునకు అవసరమైన పట్టలు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా కార్యదర్శి ప్రణీత్ మాట్లాడుతూ ఆరు గ్రామాలల్లో ఇళ్లు దెబ్బతిన్న 150 కుటుంబాల వారికి వంట సామగ్రి, ఇంటి పైకప్పుకు అవసరమైన పట్టలు అందించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, జానకిరామిరెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించండి



మాట్లాడుతున్న డీఈఓ గంగాభవాని

రాపూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని నెల్లూరు డీఈఓ గంగాభవాని తెలిపారు. మండలంలోని గోనుపల్లె, పెనుబర్తి, ఉన్నత పాఠశాలలు, తెగచర్ల ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు అందించిందని, ప్రతి ఉపాధ్యాయుడు నిత్యం ట్యాబ్‌ల ద్వారానే బోధన చేయాలని సూచించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఎంఈఓలు శ్రీనివాసులు, జిలానీబాషా ఉన్నారు.



వెంకటగిరిలో పింఛన్ నగదు అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



గూడూరురూరల్: జీఎస్ఆర్ మున్సిపల్ స్కూల్‌లో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, దేవసేనమ్మ

లబ్ధిదారులకు సంక్రాంతి

'పింఛన్ లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం ఉప్పొంగింది.. వారి బతుకుదెరువుకు ధీమా లభించింది.. ఇచ్చిన మాట నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కృతజ్ఞతాభావం వారిలో వెల్లివిరిసింది. వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.3 వేలకు పెంచడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దీంతో లబ్ధిదారుల జీవితాల్లో ముందే సంక్రాంతి వచ్చింది.' అని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో గురువారం పండుగ వాతావరణంలో జరిగిన పింఛన్ల పంపిణీలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

- అట్టహాసంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం

సైదాపురం(వెంకటగిరి): అవ్వాతాతల మదిలో ఆనందాన్ని నింపేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ మొత్తాన్ని పెంచారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిఅన్నారు. గురువారం వెంకటగిరి పట్టణంలోని ఎస్‌జేఆర్ భవనంలో బాలాయపల్లె, వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి మండలాలకు చెందిన వారికి రూ.3 వేలు పింఛన్ సొమ్ము పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో పేదలు, వృద్ధులు, వితంతువుల కష్టాలు నేరుగా చూసి పింఛనును రూ.3 వేలకు వరకు పెంచుతానని ఇచ్చిన హామీని నూతన సంవత్సర కానుకగా అందజేశారన్నారు. మాట తప్పని..మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పాలన చూసి దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసే పరిస్థితి కలిగిందన్నారు. మనకు ఏ ప్రభుత్వం సాయం చేస్తుందో ప్రజలంతా గమనించాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో తేడా గమనించాలని చెప్పారు. 2024లో ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. వెంకటగిరి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నాన్నారు. మీరంతా తనని ఆదరించి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన కోరారు.



ఓజిలి: పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డీ శారద, పార్టీ కన్వీనర్లు ఢిల్లీబాబు, శ్రీనివాసులు రెడ్డి, కార్తీక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సీ శ్రీనివాసులు రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతల కళ్లల్లో ఆనందమే జగనన్న లక్ష్యం

గూడూరురూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా పింఛన్లను పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని, అవ్వాతాతల కళ్లలో ఆనందమే ఆయన లక్ష్యం అని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. గూడూరు రెండో పట్టణంలోని జీఎస్ఆర్ మున్సిపల్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మతో కలసి లబ్ధిదారులకు పెంచిన పింఛన్‌ను అందజేశారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ మాట తప్పని, మడమ తిప్పని నేత ఎవరైనా ఉన్నారంటే అది ఒక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. పేదలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను అందించారని కొనియాడారు. చంద్రబాబు హయాంలో పింఛన్లు పెంచలేదని, అభివృద్ధి పనులు శిలాఫలాకాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. దేవసేనమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, నాయకులు కే మీరారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, నరసయ్య, సుభాన్, మురళి, అల్తాఫ్, వినీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో రూరల్ మండలంలోని లబ్ధిదారులకు కూడా ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పెంచిన పింఛన్ మొత్తాన్ని అందజేశారు. ఎంపీపీ గురవయ్య, వైస్ ఎంపీపీలు ఎం శ్రీనివాసులురెడ్డి, ఇంద్రాణి, శారదమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించండి

గూడూరురూరల్: సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఆదరించి, సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కందలి సర్పంచ్ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం కందలి, చెమిర్తి గ్రామాల్లో పింఛన్ నగదును 285 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నదేనని కొనియాడారు.



పింఛన్‌లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి

ఓజిలి: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుని, మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పెంచిన పింఛన్ నగదును లబ్ధిదారులకు గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పపాదయాత్రలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర అన్ని వర్గాల పింఛన్ లబ్ధిదారులకు రూ.3వేలు పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పిన హామీని సీఎం నెరవేర్చారన్నారు. ఓజిలి మండలంలో 5,742 పింఛన్‌దారులకు రూ.1.23 కోట్లు నగదును ముఖ్యమంత్రి ప్రతి నెలా మంజూరు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా చెరవేసి, వారి ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పనిచేసే వైఎస్సార్ సీపీకే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రవీంద్రరాజు, పార్టీ మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ప్రవీణ, కుందాం సొసైటీ అధ్యక్షుడు రాజారామిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ వేణురెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఖాదర్‌బాషా, సొసైటీ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, సుబ్బారావుయాదవ్, పీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఈఓపీఆర్డీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన జగన్‌తోనే సాధ్యం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సుపరిపాలన అందించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తూర్పువీధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబంలోని ప్రతి వ్యక్తి సంక్షేమ లబ్ధి పొందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలు అమలు చేసి, ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే చేర్చుతున్నారని చెప్పారు. ఇటువంటి సుపరిపాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని, ఈసారి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఇందుకు కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నేతలు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, కౌన్సిలర్లు డీ రాధమ్మ, ఏ శంకరయ్య, ఏ శ్రీనివాసులు, నారాయణ, పీ సుబ్బారావు, వహిదా, కే కళ్యాణి, ప్రభావతి, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి సీ హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నాయకులు సీహెచ్ మురళి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బీదాతో ఎమ్మెల్యే కిలివేటి భేటీ



ఎమ్మెల్సీ బీదా మస్తాన్‌రావుతో ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: ఎమ్మెల్సీ బీదా మస్తాన్‌రావును ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆప్కాబ్ చైర్మన్ అనిల్‌బాబు, ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలల అధినేత వంకి పెంచలయ్యను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు ఎన్బీకేఆర్ విద్యార్థి



విద్యార్థి అభినయ్ కీర్తన్‌పాల్

కోట: విద్యానగర్ ఎన్బీకేఆర్ ఐఎస్టీ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అభినయ్ కీర్తన్ పాల్ జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచిన అభినయ్ కీర్తన్‌పాల్ రిపబ్లిక్‌డే వేడుకలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిని అభినందించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

దొరవారిసత్రం: రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని అటుగా వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ సుబ్రమణ్యంతోపాటు రైల్వే కాంట్రాక్టర్ సురేష్‌కుమార్ తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం ఎస్ఎం అగ్రహారం సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. చెన్నైకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ సురేష్‌కుమార్ తన కారులో డ్రైవర్ సుబ్రమణ్యంతోకలసి హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఎస్ఎం అగ్రహారం గ్రామం వచ్చే సరికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగిపోయి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఆందోళకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. స్థానిక పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



గాయపడిన సుబ్రమణ్యం



సురేష్‌కుమార్

క్రీడలతో మానసికోల్లాసం

వాకాడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లోని యువతీయువకులు క్రీడల్లోను రాణించాలని ఎంపీడీఓ గోపీనాథ్ అన్నారు. వాకాడు గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. దుగ్గరాజపట్నం, కల్లూరు, తిరుమూరు సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొని, సత్తా చాటారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. దేశంలో అతిపెద్ద క్రీడా టోర్నీ ఆడుదాం..ఆంధ్ర కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామాంజనాచార్యులు, డి భాస్కర్‌రెడ్డి, వీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ప్రజాప్రతినిధులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. బుధవారం ఆమె బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం..ఆంధ్ర బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను ప్రారంభించి, క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. 5 స్థాయిల్లో 2.99 మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పన అభినందనీయం



జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

చిల్లకూరు: తీరప్రాంత ప్రజలకు అంబులెన్స్ సౌకర్యం కల్పించడానికి జిందాల్ సింహపురి పవర్ ప్లాంట్ యాజమాన్యం ముందుకు రావడం ఎంతో అభినందనీయమని ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వరగలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా ఉండేలా జేఎస్పీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల కింద అంబులెన్స్‌ను గురువారం అందజేశారు. ఆర్డీఓ జెండా ఊపి, అంబులెన్స్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలోని 12 గ్రామాల వారికి ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసర పరిస్థితులో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ రావాలంటే కనీసం గంట సమయం పడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని జిందాల్ సింహపురి పవర్ ప్లాంట్ యాజమాన్యం అంబులెన్స్‌ను కొనుగోలు చేసి, వరగలి పీహెచ్‌సీకి అనుబంధంగా ఉంచడంతో ఎంతో మందికి ఊరట లభిస్తుందన్నారు. అంబులెన్స్‌ను వినియోగించుకునే వారు ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలని, త్వరలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమ ప్రారంభించిన 10 నెలలోనే ఎన్నో సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. త్వరలోనే విద్యకు సంబంధించి కొంత మంది ట్యూటర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా పలు పాఠ్యాంశాల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వై జానకిరామిరెడ్డి, తమ్మినపట్నం, వరగలి, మోమిడి సర్పంచ్‌లు ఎస్. సుబ్రహ్మణ్యం, బండి మాధవి, ఈ లావణ్య, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటసూర్యసాయి, పరిశ్రమ ప్రతినిదులు విల్సన్, మాథ్యూ, లీలా, శివాజీ, వైద్యురాలు గీతామణి పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం విజయవంతంపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్య పరీక్షలతోపాటు 172 రకాల మందులను కూడా ఉచితంగా అందజేస్తుందన్నారు. ఏఓ పురుషోత్తం శివకుమార్, ఏఓ హైమావతి, ఎంఈఓ దయాకర్, ఏఈ భాస్కర్ పాల్గొన్నారు.

కండలేరులో 12.992 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 12.992 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిల్లకూరు:మండలంలోని బల్లవోలుకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బల్లవోలు గ్రామానికి చెందిన ఏ పెద పెంచలయ్య (65) గత డిసెంబర్ 29వ తేదీన పొలం వద్దకు వెళ్లి, తిరిగి ఇంటికి రోడ్డుపై నడిచి వెళుతుండగా చింతవరం వైపు నుంచి బల్లవోలు వైపు వెళ్లే మోటారు సైకిల్ అతడిని ఢీ కొంది. దీంతో అతడు తీవ్రంగా గాయపడగా చెన్నైలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృత్తి విద్యపై అవగాహన

దొరవారిసత్రం: బీసీ గురుకులం విద్యార్థులకు వృత్తివిద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేటలోని గోకుల్‌కృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ తిరుపతయ్య తెలిపారు. తమ పాఠశాల నుంచి వెళ్లిన విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు అవగాహన కల్పించారన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రాపూరు: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ డీ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. రాపూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్న సభకు సంబంధించిన పనులను గురువారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మద్దెలమడుగు నుంచి రాష్ట్ర నాయకులకు భారీ స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. మద్దెలమడుగు నుంచి రాపూరు వరకు ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశామని చెప్పారు. నాయకులు శౌరెడ్డి, డాక్టర్ ఖాదర్‌బాషా, పిచ్చిరెడ్డి, సంజీవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట వేయండి



మంత్రిని సత్కరించిన ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పరిధిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి కాకాణి సూచించారని ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పదవి మరో ఆరునెలల పాటు పొడిగించడంతో ఆయన గురువారం ఎమ్మెల్యే కిలివేటితోపాటు మంత్రి కాకాణిని నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు టీ సురేష్‌రెడ్డి, ఎన్‌సీఆర్, పీ రాహుల్, షేక్ షబ్బీర్, డీ నారాయణరెడ్డి, ముత్యాలరెడ్డి, డీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు: ఎన్నికల నేపథ్యంలో నియమావళిని అనుసరించి జాగ్రత్తలు తప్పక పాటించాలని సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా చిల్లకూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి రికార్డులను పరిశీలించి, క్రైమ్ రేట్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో ప్రతి గ్రామంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికే నేర చరిత్ర ఉన్న వారిని ఎంత మందిని బైండోవర్ చేసుకున్నారు.. వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారా లేదా? అన్న విషయాలను రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. నేర చరిత్ర ఉన్న వారి ఫొటోలు గత కొన్ని సంవత్సరాల కిందట ఇచ్చి ఉన్నారని, వాటిని గుర్తించడం కష్టంగా ఉన్నందున కొత్త ఫొటోలు రికార్డుల్లో పొందు పరచాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. త్వరలోనే జిల్లా ఎస్పీ తనిఖీలు ఉండే అవకాశం ఉన్నందున స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ అంజిరెడ్డి ఉన్నారు.

24 మద్యం బాటిళ్ల స్వాధీనం

చిల్లకూరు: మండలంలోని మన్నేంగుంట గ్రామంలో బెల్టుషాపుపై పోలీసులు దాడి చేసి, 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి కథనం మేరకు.. మండలంలోని మన్నేంగుంటలో శ్రీహరి అనే వ్యక్తి మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన ఎస్ఐ తన సిబ్బందితో కలసి ఆ గ్రామంలో దాడులు చేశారు. ఆ సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీహరిని అదుపులోకి తీసుకుని, 24 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

